ప్రజాశక్తి
శుక్రవారం 12 మే 2023
5
విజయనగరం



ట్రాఫిక్ డిఎస్‌పి విశ్వనాధ్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-విజయనగరం



విజయనగరం ట్రాఫిక్ పోలీసు స్టేషను డిఎస్‌పిగా డి.విశ్వనాథ్ గురువారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ట్రాఫిక్ పోలీసు స్టేషను డిఎస్‌పిగా సుమారు మూడేళ్లు పనిచేసిన ఎల్.మోహనరావు రాష్ట్ర పోలీసు హెడ్ క్వార్టర్స్ కు బదిలీ అయ్యారు. పోలీసు హెడ్ క్వార్టర్స్ లో వెయిటింగులో ఉన్న డి.విశ్వనాథ్‌ను ట్రాఫిక్ డిఎస్‌పిగా నియమిస్తూ డిజిపి కెవి రాజేంద్రనాథ్ రెడ్డి ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. ట్రాఫిక్ డిఎస్‌పిగా బాధ్యతలు చేట్టిన విశ్వావాధ పోలీసుశాఖలో డైరెక్ట్ డిఎస్‌పిగా 2018 బ్యాచ్ గ్రూప్1 కు చెందినవారు. గతంలో శ్రీకాళహస్తి డిఎస్‌పిగా విధులు నిర్వహించారు.

బటన్ నొక్కినా...
కానరాని ఆసరా



వైకెపి కార్యాలయాలు, బ్యాంకుల చుట్టూ తిరుగుతున్న మహిళలు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి/రేగిడి

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న ఆసరా పథకం డబ్బులు బ్యాంకు ఖాతాల్లో జమకాకపోవడంతో డ్వాక్రా సంఘాల మహిళలకు ఎదురుచూపులే మిగులుతున్నాయి. 45 రోజులు దాటినా మహిళల అకౌంట్లలో డబ్బులు జమ కాకపోవడంతో జగన్ మోహన్‌రెడ్డి సరిగా బటన్ నొక్కలేదేమోనని మహిళలు విమర్శిస్తున్నారు. మరోవైపు ఆసరా డబ్బులు తమ అకౌంట్లలో ఎప్పుడుపతాయోనని ఎదురు చూస్తున్నారు. అసలు డబ్బులు వస్తాయో రావోనని మరికొందరు ఆందోళన చెందుతున్నారు.

అధికారంలోకి వస్తే స్వయం సహాయక సంఘాల రుణాలను మాఫీ చేస్తానని ఎన్నికలకు ముందు సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. అధికారంలోకి వచ్చాక 2019 ఏప్రిల్ 11వ తేది నాటికి ఉన్న స్వయం సహాయక సంఘాల సభ్యుల రుణ బకాయి నగదును నాలుగు విడతల్లో తిరిగి సభ్యుల ఖాతాల్లో జమచేస్తామని చెప్పారు. మూడో విడతగా జిల్లాలో 36,463 స్వయం సహాయక సంఘాల సభ్యులకు రూ.251.30 కోట్లు అందజేయాల్సి ఉంది. దీనికి సంబంధించిన రాష్ట్ర వ్యాప్తంగా కార్యక్రమాన్ని మార్చి 25న సిఎం జగన్మోహన్‌రెడ్డి ఏలూరు జిల్లా కేంద్రంలో బటన్ నొక్కి ప్రారంభించారు. దీనిపై ప్రభుత్వ ఆదేశాల మేరకు సుమారు పది రోజులపాటు మండల కేంద్రాల్లో నిర్వహించిన సభలు నిర్వహించారు. స్వయం సహాయక సంఘాల సభ్యులను బలవంతంగా తీసుకెళ్లి వైఎస్‌ఆర్ ఆసరా వేడుకలు నిర్వహించారు. తీరా సిఎం సిఎం బటన్ నొక్కి 45 రోజులు దాటినా ఇప్పటికీ వందలాది గ్రూపుల్లోని వేలాది మంది సభ్యుల ఖాతాల్లో డబ్బులు జమ కాలేదు. జిల్లా వాప్తంగా దాదాపు అన్ని మండలాల్లోని బాధితులు ఉన్నారు. ఇంతకీ ప్రభుత్వం వద్ద డబ్బులు లేవా? లేక ఉద్దేశపూర్వకంగా తాత్సారం చేస్తుందా? అంటూ ప్రజానీకం సందేహాలు వ్యక్తం చేస్తున్నారు.

వైఎస్‌ఆర్ ఆసరా పేరిట ఈ పథకాన్ని 2020 సెప్టెంబర్ 11న ప్రారంభించారు. ఆ ఏడాది 36,434 స్వయం సహాయక సంఘాలకు రూ.250.54 కోట్లు అందజేశారు. రెండో దశలో 2021 సెప్టెంబర్‌కు బదులు అక్టోబర్ 7న అట్టహాసంగా ప్రారంభించినా అర్హులందరికీ నగదు పడేసరికి ఆ నెలాఖరు అయ్యింది. విడతల వారీగా 36,475 స్వయం సహాయ సంఘాల సభ్యులకు రూ.252.28 కోట్లు అందింది. ఈ లెక్కన మూడో విడత 2022 సెప్టెంబర్ లేదా అక్టోబర్‌లో 36,463 స్వయం సహాయక సంఘాల సభ్యులకు రూ.251.30కోట్లు అందజేయాల్సి ఉంది. డిసెంబర్ వరకు ఉలుకూ పలుకూ లేకుండా పోయింది. చివరికి డిసెంబర్ చివరిలో 2023 జనవరిలో జమచేస్తామని ప్రభుత్వం చెప్పింది. ఆ తరువాత ఉగాదికి తప్పకుండా ఖాతాల్లో జమ అవుతుందని చెప్పుకొచ్చారు. చివరికి మార్చి 25న అట్టహాసంగా ప్రారంభించారు. కానీ, ఇప్పటికీ డబ్బులు జమకాలేదు. రోజూ వైకెపి కార్యాలయాలు, బ్యాంకుల చుట్టూ మహిళలు తిరుగుతున్నా డబ్బులు వారి అకౌంట్లలో పడకపోవడంతో నిరాశతో వెనుదిరుగుతున్నారు.

రేగిడి మండలంలో 39 గ్రామపంచాయతీల్లో 66 గ్రామాలు ఉన్నాయి. 1408 గ్రామ మహిళా సంఘాలు ఉన్నాయి.. వీరికి ఆసరా పథకంలో భాగంగా రూ.10కోట్ల 32లక్షలు మంజూరయ్యాయి.

1074 మహిళా సంఘాలకు ఆసరా జమ

రేగిడి మండలంలో 1408 గ్రామమహిళా సంఘాలకు గాను 1074 సంఘాలకు డబ్బులు జమయ్యాయి. మిగిలిన 334 సంఘాలకు పూర్తిగా జమకాలేదు. కొన్ని సంఘాలకు జమ కావడంతో మరికొన్ని సంఘాలకు జమ కాకపోవటంతో మహిళల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయి.

మంగమ్మ, ఎపిఎం, రేగిడి

ఆసరా రాలేదు..



ఆసరా పథకం మూడో విడత ఇంతవరకు రాలేదు. వాటి కోసం రోజూ తిరుగుతున్నాం. ఆ డబ్బులు రాకపోతే బ్యాంకు రుణం తీరదు. డబ్బులు కట్టకపోతే బ్యాంకు వాళ్లు పీడిస్తారు. ఇన్ని రోజులైనా ఎందుకు ఇవ్వడం లేదో తెలియడం లేదు.

దువ్వి చిన్నమ్మి, సంకిలి గ్రామం

ఎదురు చూస్తున్నాం..



ఆసరా డబ్బులు ఎప్పుడొస్తాయా అని ఎదురు చూస్తున్నాం. 45రోజులైనా డబ్బులు ఇవ్వలేదు. రోజూ బ్యాంకు చుట్టూ తిరిగినా ప్రయోజనం కనిపించడం లేదు. డబ్బులొస్తే బ్యాంకు అప్పు తీరుస్తాం.

పి.రాములమ్మ, పురిటిపెంట, గజపతినగరం మండలం

వైసిపి వారికే ఇస్తున్నారు..



ఆసరా పథకం డబ్బులు వైసిపికి చెందిన మహిళలకే ఇస్తున్నారు. మిగతా వారికి ఇవ్వడం లేదు. పథకం లబ్ధిదారులకు పూర్తిగా అందడం లేదు. 2నెలలు అయినా ఇంతవరకు రాలేదు. ఒకరికి వస్తే మరొకరికి రావడం లేదు. రోజూ ఎదురుచూస్తున్నాం.

జయమ్మ, రేగిడి గ్రామం

స్కూళ్లు తెరిచే నాటికి నాడు-నేడు పనులు పూర్తి

● విద్యార్థులు డ్రాపౌట్ కాకుండా చర్యలు ● ఫ్యామిలీ డాక్టర్ విధానంపై అవగాహన
● అధికారులకు కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశం

ప్రజాశక్తి-రాజాం



బొద్దాంలో నాడు-నేడు పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

నాడు - నేడు కింద పాఠశాలల్లో చేపట్టిన మరమ్మత్తులు, పాఠశాలల ఆధునీకరణ పనులను వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు తెరిచేలోగా పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి మండల విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. ఆయా పాఠశాలల్లో చేపట్టిన మరుగుదొడ్లు, పాఠశాల భవనాల మరమ్మత్తు పనులు వేసవి సెలవుల్లోనే పూర్తిచేయాలన్నారు. ఈ పనుల కోసం నిధుల కొరత లేదని త్వరగా పూర్తి చేయడంపై దృష్టిసారించాలని చెప్పారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు తర్వాత చదువును కొనసాగించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఆయా గ్రామాల టీచర్లు, పంచాయతీ కార్యదర్శి, వలంటీర్లు, సంక్షేమ కార్యదర్శులు ఒక జట్టుగా ఏర్పడి విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడాలన్నారు. మండలంలోని బొద్దాం, సోపేరు గ్రామాల్లో గురువారం పర్యటించారు. తొలుత బొద్దాం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ గురవారం సందర్శించారు. ఈ సందర్భంగా నాడు-నేడు పనులను పరిశీలించారు. పదో తరగతి ఫెయిలైన విద్యార్థులందరినీ ప్రత్యేక తరగతులకు రప్పించి వారందరూ ఉత్తీర్ణులయ్యేలా తగిన శిక్షణ ఇవ్వాలని పాఠశాల ప్రధానోపాధ్యాయుడిని ఆదేశించారు. జగ్గువానిపేట చెరువులో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించి వేతన చెల్లింపులు సక్రమంగా జరుగుతున్నదీ లేనిదీ తెలుసుకున్నారు. సాంకేతిక కారణాల వల్ల వేతనాలు అందడంలో జాప్యం జరగకుండా చర్యలు చేపట్టాలని ఉపాధిహామీ అధికారులను ఆదేశించారు. బొద్దాంలోని పేదలందరికీ పథకంలో మంజూరైన ఇళ్ల కాలనీని సందర్శించి లబ్ధిదారులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఇళ్ల నిర్మాణానికి సంబంధించి పూర్తి చెల్లింపులు జరగలేదని కొందరు లబ్ధిదారులు వివరించగా దీనిపై చర్యలు తీసుకుంటామన్నారు. సామూహిక గృహప్రవేశాల కోసం నిర్దేశించిన లక్ష్యం మేరకు ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని గృహ నిర్మాణ సంస్థ ఎఇని ఆదేశించారు. సోపేరు గ్రామంలో మంజూరైన గ్రామ సచివాలయం భవనాన్ని నెలాఖరులోగా పారంభించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. శ్లాబ్ దశలో ఆగిపోయిన రైతుభరోసా కేంద్రం, వెల్ నెస్ కేంద్ర భవనాలను మరో రెండు నెలల సమయంలో పూర్తిచేయాలని పంచాయతీరాజ్ డిఇని ఆదేశించారు. సచివాలయాన్ని సందర్శించి వివిధ శాఖల కార్యదర్శులు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. రక్తహీనత గల బాలికలు, ప్రసూతి మహిళలకు అందిస్తున్న ఆరోగ్య సేవలపై అడిగి తెలుసుకున్నారు. పర్యటనలో ఆర్‌డిఒ అప్పారావు, ఎంపిడిఒ శంకర్రావు, ఇఒపిఆర్‌డి శ్రీనివాస్, తహశీల్దార్ కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గూడెపువలసలో ఫ్యామిలీ డాక్టర్ విధానం పరిశీలన

గరివిడి : గూడెపు వలసలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా గ్రామీణులకు అందుతున్న వైద్య సేవలను కలెక్టర్ పరిశీలించారు. ఇప్పటివరకు గ్రామంలోని 74శాతం మందితో సర్వే పూర్తయిన వైద్యులు వివరించగా వందశాతం గుర్తింపు పూర్తిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహశీల్దార్ టి.గోవింద, వైద్యాధికారి డా.కె.రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.



పథకాల అమలు గురించి ఆరా తీస్తున్న కోలగట్ల వీరభద్రస్వామి

14 నుంచి అందుబాటులోకి మహిళా పార్కు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 14వ తేదీ సాయంత్రం నుండి మహిళా పార్కును పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురానున్నట్లు మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి తెలిపారు. గురువారం నగరపాలక సంస్థ కార్యాలయంలో సమావేశమై పార్కు నిర్వహణా విషయాలపై చర్చించారు. అనంతరం మాట్లాడుతూ ఈనెల 14వ తేదీ సాయంత్రం నుంచి మహిళా పార్కును మహిళలకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు చెప్పారు. ప్రతిరోజు ఉదయం 5 గంటల నుండి 9 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుండి 9 గంటల వరకు ప్రవేశ వేళలుగా నిర్ణయించినట్లు చెప్పారు. పార్కులోకి కేవలం మహిళలకు మాత్రమే ప్రవేశం ఉంటుందని తెలిపారు. ఐదేళ్ల లోపు పిల్లలకు కూడా ప్రవేశ అవకాశాన్ని కల్పిస్తున్నట్లు చెప్పారు. పార్కు నిర్వహణకు కమిటీ వేయడంతో పాటు పార్కులో ఏర్పాటుచేసిన ప్రత్యేక వేదికపై కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. పార్క్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన తెరపై వినోదం కోసం చలనచిత్రాలు ప్రదర్శించనున్నట్లు తెలిపారు. సమావేశంలో డిప్యూటీ మేయర్ రేవతి దేవి, ఇఇ కె శ్రీనివాసరావు, ఎఇ వెంకటేశ్వరరావు, వివిధ మహిళా స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



మేయర్ విజయలక్ష్మికి వినతినిస్తున్న పిపిఎస్‌ఎస్ నాయకులు శంకరరావు, యుఎస్ రవికుమార్

సమస్యలన్నీ పరిష్కరిస్తాం
డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

గడప గడపకూ కార్యక్రమంలో భాగంగా ప్రజలు తమ దృష్టికి తెచ్చిన సమస్యలన్నీ పరిష్కరిస్తున్నామని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. గురువారం ధర్మపురిలో పర్యటించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు అమలు తీరును వివరిస్తూనే స్థానిక సమస్యలు ఉంటే చెప్పండి అంటూ ప్రజలను అడిగారు. పెద్దగా సమస్యలు లేవని చెప్పడంతో సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జోనల్ ఇన్చార్జి బొద్దాన అప్పారావు, స్థానిక కార్పొరేటర్ పతివాడ గణపతి రావు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో అభివద్ధి కేవలం శంకుస్థాపనలకే పరిమితమైందని అన్నారు. నగరంలో అనేక అభివృద్ధి పనులు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి నేతత్వంలో జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ రేవతి దేవి,జోనల్ ఇన్చార్జ్ మారెం బాల బ్రహ్మారెడ్డి, డివిజన్ ఇన్చార్జి పూసర్ల శ్రీనివాసరావు,డివిజన్ యువజన అధ్యక్షుడు సువ్వాడ జయరాం, డివిజన్ మహిళా అధ్యక్షురాలు చందక ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైద్యానికి రూ. 22లక్షలు మంజూరు

ప్రజాశక్తి-రేగిడి

మండలంలోని నాయరాలవలస పంచాయతీ పరిధి రెడ్డిపేటకు చెందిన రెడ్డి సత్యవేణి అనే యువతీ బ్లడ్ క్యాన్సర్, బోన్ ట్రాన్స్‌పరేషన్ వైద్యానికి ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి రూ.22 లక్షల మంజూరు చేశారు. గత కొన్నేళ్లుగా సత్యవేణి బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతుంది. వావిలవలస గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త పాలూరు సిద్ధార్థను సత్యవేణి తల్లిదండ్రులు కలిశారు. గురువారం విశాఖపట్నం మధురవాడ స్టేడియం వద్దకు వచ్చిన సిఎం జగన్మోహన్‌రెడ్డిని సిద్ధార్థ సహకారంతో కలిశారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని సిఎంకు వివరించారు. తక్షణమే ఆయన స్పందించి వైద్యానికి రూ.22 లక్షలు హాస్పిటల్ ఖర్చు మొత్తం ప్రభుత్వమే భరిస్తుందని తెలిపారు. అక్కడే ఉన్న కలెక్టర్ మల్లికార్జున్‌కు ఆదేశించారు. దీంతో సిఎంకు వారు కృతజ్ఞతలు తెలిపారు.



సిఎంను కలిసేందుకు వెళ్లిన సత్యవేణి

అయ్యప్పనగర్ స్వామి లేఅవుట్లో
అక్రమ వాటర్‌ప్లాంట్‌ను రద్దు చేయాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని ఒకటో డివిజన్ అయ్యప్ప నగర్‌లో నిర్వహిస్తున్న అక్రమ వాటర్ ప్లాంట్‌ను రద్దు చేయాలని పట్టణ పౌరసంక్షేమ సంఘం, విజయనగరం అపార్ట్ మెంట్లు కాలనీస్ అసోసియేషన్ నాయకులు యుఎస్ రవి కుమార్, పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యాదర్శి రెడ్డి శంకరరావు డిమాండ్ చేసారు. గురువారం మేయర్ విజయలక్ష్మికి కార్పొరేషన్ కార్యాలయం వద్ద వినతి అందజేశారు. జనావాసాల మధ్య వాటర్ ప్లాంట్ జనావాసాల మధ్య వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయ కూడదని ప్రభుత్వ నిబంధన ఉన్నా రాజకీయ పలుకుబడితో వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారని అన్నారు. 500 అడుగులు ఆపైన లోతులో బోరు తవ్వి నీరు అమ్ముకుంటున్నారని, దీంతో 500 అడుగుల లోపు ఉన్న మోటార్లన్ని వేసవి లో ఎండిపోయాయని తెలిపారు. వెంటనే అధికారులు కలుగ చేసుకుని వాటర్ ప్లాంట్‌ను రద్దు చేయాలని కోరారు. మేయర్ స్పందించి ఇంజినీరింగ్ అధికారులను పిలిచి మాట్లాడారు తక్షణమే పై సమస్యల పరిష్కారంకోసం తగు చర్యలను తీసుకోవాలని చెప్పారు.



తైక్వాండోలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

'సీతం'లో జాతీయ సాంకేతిక దినోత్సవం

ప్రజాశక్తి-విజయనగరం



డాక్టర్ సుబ్రహ్మణ్యంను సన్మానిస్తున్న సీతం సిబ్బంది

స్థానిక సీతం ఇంజినీరింగ్ కళాశాలలో జాతీయ సాంకేతిక దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య వక్తగా ఐఐటి మద్రాస్ భౌతిక శాస్త్ర ఆచార్యులు డాక్టర్ ఎ. సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. ఆయన ఈ ఏడాది థీమ్ 'స్కూల్ టు స్టార్టప్ - ఇగ్నైటింగ్ యంగ్ మైండ్స్ టు ఇన్నోవేట్' అనే అంశంపై ప్రసంగించారు. కృత్రిమ మేధస్సు, యంత్ర అభ్యాసం, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, రోబోటిక్స్ మొదలైన అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలను గురించి విద్యార్థులకు వివరించారు. ముఖ్యంగా రోబోటిక్స్ పరిణామాలు, అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలను గురించి విశ్లేషించారు. సీతం కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి. శశి భూషణ్ రావు, మాట్లాడుతూ టెక్నాలజీ అభివద్ధి వల్ల ఎదురవుతున్న సవాళ్లను గురించి వివరిస్తూ వాటి పరిష్కారాలను కనుగొనేలా విద్యార్థులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వి. రామమూర్తి, సివిల్ విభాగాధిపతి , కన్వీనర్ డాక్టర్ జి. రవికిషోర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు శంకరరావు

కార్మికుల నష్టాన్ని భర్తీ చేయాలి

ప్రజాశక్తి- బొబ్బిలి

మైథాన్ (పూర్వ ఇంపెక్స్) ఫెర్రో అల్లాయిస్ పరిశ్రమ మూతపడటం వల్ల నష్టపోయిన కార్మికుల నష్టాన్ని భర్తీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు పి. శంకరరావు డిమాండ్ చేశారు. స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ సమీపంలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పరిశ్రమ యాజమాన్యంతో ఎమ్మెల్యే, పోలీసులు చేయి కలిపి కార్మికులను నిట్టనిలువునా ముంచేశారన్నారు. ఉపాధి కావాలని అడిగిన పాపానికి వందలాది మంది అమాయకులైన గ్రామీణ కార్మికులను లాటీలతో కుళ్ళబొడిచి, విశాఖపట్నం సెంట్రల్ జైలుకు పంపించి హింసించారన్నారు. అందుకు తగిన మూల్యం చెల్లించడానికి ప్రభుత్వం సిద్ధపడకతప్పదన్నారు. గ్రోత్ సెంటర్‌లో పారిశ్రామిక అభివృద్ధి ఈ వైసిపి ప్రభుత్వ హయాంలో నేతిబీరకాయలో నేయి అన్న చందంగా తయారైందన్నారు. ఈ సమావేశంలో గ్రోత్ సెంటర్ సిఐటియు నాయకులు ఎస్. గోపాల్, సింహాచలం, కోల శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా తైక్వాండో శిక్షణ

ప్రజాశకి-విజయనగరం టౌన్

స్థానిక థెరిస్సా క్లబ్ లో జిల్లా తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి సిహెచ్ వేణుగోపాల్ ఆధ్వర్యంలో జరుగుతున్న వేసవి శిక్షణా శిబిరానికి విశేష స్పందన లభించింది. నగరంలో వందలాది మంది విద్యార్దులు ఉదయం 6 గంటలకు, సాయంత్రం 5 గంటలకు వెళ్లి తైక్వాండో లో శిక్షణ తీసుకుంటున్నారు. ముందుగా విద్యార్థులకు వామప్, ఎక్సర్‌సైజ్‌లు చేయించి అనంతరం తైక్వాండో లో శిక్షణ ఇస్తున్నారు. ఆత్మరక్షణతో పాటు శారీరకంగా, మానసికంగా విద్యార్థులను తయారు చేయడంతో పాటు విద్యార్థులు జీవితం లో మంచి భవిష్యత్ ఏర్పాటు చేసుకునేందుకు తైక్వాండో శిక్షణ తోడ్పడుతుందని కోచ్ వేణుగోపాలరావు అన్నారు.

13న యోగోత్సవం

ప్రజాశక్తి-విజయనగరంకోట

యోగా పై విస్తృత ప్రచారమే లక్ష్యంగా ఈనెల 13న జిల్లాలో ప్రత్యేక యోగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు గీతం యూనివర్సిటీ అప్లైయిడ్ సైకాలజీ విభాగాధిపతి, ప్రొఫెసర్ కె.సునీత తెలిపారు. స్థానికంగా గురజాడ స్వగృహంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, యోగా ప్రశస్త్యాన్ని, ప్రయోజనాలను వివరించారు. శారీరకంగా, మానసికంగా ధృడంగా తయారయ్యేందుకు యోగా ఎంతగానో దోహదం చేస్తుందని అన్నారు. యోగాను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు ప్రతీఏటా జూన్ 21న ప్రపంచ యోగా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. సామరస్య జీవన విధానమే లక్ష్యంగా, యోగాపై దేశవ్యాప్తంగా విస్తత ప్రచారాన్ని నిర్వహించేందుకు 100రోజుల కౌంట్‌డౌన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని, దీనిలో భాగంగా 39వ రోజు ప్రచార కార్యక్రమం విజయనగరంలో మే 13న జరుగుతుందని తెలిపారు. విజయ నగరంలో గీతం డీమ్డ్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందని వివరించారు. 13 ఉదయం 5.30 గంటలు నుంచి 7 గంటలు వరకు విజయనగరం కోటలోని మోతిమహల్‌లో జరిగే యోగా కార్యక్రమంలో వివిధ విద్యాసంస్థలు, యోగ శిక్షణా సంస్థలు పాల్గొంటాయని తెలిపారు. సమావేశంలో అకాడమీ ఆఫ్ యోగా కాన్స్వీక్నెస్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సిహెచ్ శ్రీకృష్ణ, యోగ నిపుణులు ఎన్.రవి, సన్యాశిరావు, భారతి పాల్గొన్నారు.

సబ్ జూనియర్ వాలీబాల్ క్రీడాకారుల ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 14న రాజమండ్రి లో జరగబోయే రాష్ట్ర స్థాయి వాలీబాల్ సబ్ జూనియర్స్ క్రీడాకారుల ఎంపిక గురువారం రాజీవ్ క్రీడా ప్రాంగణంలో జరిగింది. జిల్లా నలుమూలల నుండి సుమారు 30 మంది హాజరయ్యారు. జి. ప్రవల్లిక (బొబ్బిలి), ఎం. విజయ లక్ష్మి (విజయనగరం), ఎం.జానకి (గుమ్మలక్ష్మిపురం), పి. చాణక్య వర్మ (విజయనగరం)ఎంపికయ్యారు. వీరు రాష్ట్ర స్థాయి వాలీబాల్ ఎంపికలో పాల్గొంటారని జిల్లా వాలీబాల్ అసోసియేషన్ కార్యదర్శి కెవిఎఎన్ రాజు తెలిపారు. ఎంపిక ప్రక్రియలో జిల్లా వాలీబాల్ అసోసియేషన్ చైర్మన్ భగవాన్ దాస్,అధ్యక్షులు జి.సూరిబాబు ,కోశాధికారి సన్యాసి నాయుడు అసోసియేషన్ సభ్యులు,క్రీడాకారులు పాల్గొన్నారు.

ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు

డెంకాడ : మండలంలోని అక్కివరం ఆదర్శపాఠశాలలో ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపల్ సిహెచ్ సంధ్య గురువారం ఒక ప్రకటనలో కోరారు. ప్రవేశ పరీక్షకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఒబిసి విద్యార్థులు 2011 సెప్టెంబరు 1నుంచి 2013 ఆగస్టు 31 మధ్య పుట్టి ఉండాలన్నారు. ఎస్‌సి, ఎస్‌టిలు 2009 సెప్టెంబరు 1 నుంచి 2013 ఆగస్టు 31 మధ్య పుట్టి ఉండాలని చెప్పారు. ఒసి, బిసిలు దరఖాస్తు రుసుము రూ. 150, ఎస్‌సి,ఎస్‌టిలు రూ.75 చెల్లించాలని చెప్పారు. జూన్ 6న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు.

దయగలగోడకు 200 చీరలు అందజేత


చీరలను అందిస్తున్న మురళీధర్

బొబ్బిలి : శ్యామలాంబ టీచర్ కుటుంబ సభ్యులు ఆమె జ్ఞాపకార్థం గురువారం దయగలగోడకు 200 చీరలను కుటుంబ సభ్యులు నాగ మురళీ ధర్ అందజేశారు. ఈ సంద ర్భంగా దయగల గోడ వ్యవస్థాపకులు ఎం. విజయమోహన్ రావు మాట్లాడుతూ సమాజహితం కోరే వారి సేవా గుణాలను కొనసాగించడమే వారి వారసుల కర్తవ్యం అని గుర్తు చేశారు. ఈ దుస్తులను వారి కోరిక మేరకు గిరిజన మహిళలకు అందజేస్తామని తెలిపారు. దాత నాగ మురళీధర్‌ని దయగల గోడ సభ్యులు ముద్దాన వెంకటరావు, మజ్జి ప్రసాద్, నేరాడబిల్లి గణేష్‌లు అభినందించారు.


డ్రోన్ సర్వేను ప్రారంభిస్తున్న జెడ్‌పిటిసి సన్యాసినాయుడు, తదితరులు

రీసర్వేతో భూ సమస్యలు పరిష్కారం

నెల్లిమర్ల: రీసర్వేతో భూ సమస్యలు పరిష్కారమవుతాయని జెడ్‌పిటిసి గదల సన్యాసి నాయుడు అన్నారు. గురువారం కొండ వెలగాడలో జగనన్న శాశ్వత భూ హక్కు -భూ రక్ష పథకంలో భాగంగా డ్రోన్ ఎగురు వేసి రీసర్వేను లాంఛనంగా ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతు దశబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను పరిష్కరించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం రీ సర్వేను ప్రారంభించిందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తుమ్మలపేట సొసైటీ మాజీ అధ్యక్షులు దంతులూరి గిరిబాబు, నాయకులు మొయిద అక్కోజీ, చంద్రంపేట మాజీ సర్పంచ్ కర్రోతు వెంకట రమణ, నాయకులు వాల్లె అప్పలనాయుడు, పంచాయతి కార్యదర్శి యర్ర రమణ, విఆర్‌ఒ ఎం.డి జహీర్, సర్వే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


లేగ దూడలను పరిశీలిస్తున్న పశువైద్యాధికారులు

లేగ దూడల ప్రదర్శన

వేపాడ: మండలంలోని సీతారాంపురంలో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో గురువారం లేగ దూడల ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారులు లేగ దూడల పెంపకం, పశువుల పెంపకంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో 41 లేగ దూడలు ప్రదర్శనలో పాలొనగా డిప్యూటీ డైరెక్టర్, సర్పంచ్ బంగారయ్య, ఎంపిటిసి ముత్యాలమ్మ, జిల్లా పంచాయతీరాజ్ జోనల్ అధికారి ఎం. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థినులకు సూచనలు చేస్తున్న చంద్రావతి

సప్లిమెంటరీ కోచింగ్ ప్రారంభం

నెల్లిమర్ల : స్థానిక డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల, కళాశాలలో ఇంటర్, పదో తరగతి ఫెయిలైన విద్యార్థులకు సప్లిమెంటరీ కోచింగ్ సెంటర్‌ను గురువారం ప్రారంబించారు. ఈ కోచింగ్ సెంటర్‌లో వంగర, వేపాడ, చీపురుపల్లి, వియ్యంపేట, నెల్లిమర్ల గురుకుల పాఠశాలలకు చెందిన 70 మంది విద్యార్థులకు ఇక్కడ శిక్షణ ఇస్తున్నట్లు జిల్లా సమన్వయకర్త బలగ చంద్రావతి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె కోచింగ్ సెంటర్‌ను సందర్శించారు. ఉపాధ్యాయ సిబ్బందికి సమావేశం ఏర్పాటు చేసి అందరూ చిత్తశుద్ధితో విధ్యార్థినులకు బోధించి ఉత్తీర్ణత సాధించే విధంగా ప్రణాళి వేసుకోవాలని సూచించారు. ఆమెతో పాటు వియ్యంపేట ప్రిన్సిపాల్ జయశ్రీ, నెల్లిమర్ల ప్రిన్సిపాల్ కె. ఉషారాణి, సిబ్బంది ఉన్నారు.


ఎర్రినాయుడు కృత్రిమ చేతిని పరిశీలిస్తున్న గవర్నర్

గవర్నర్‌ను కలిసిన వికలాంగుడు

కొత్తవలస: మండలంలోని మంగళపాలెంకు చెందిన వికలాంగుడు ఎర్రి నాయుడుని ఎపి గవర్నర్ జస్టిస్ ఎస్. అబ్దుల్ నజీర్‌ను గురువారం విజయవాడలో కలిశారు. గవర్నర్ గతంలో సుప్రీంకోర్టు జడ్జిగా ఉన్న సమయంలో యాక్సిడెంట్‌లో వికలాం గులైన వారికి పరిహారం పొందే విధంగా చేశారు. ఆయన చేసిన సేవలకు గాను ఎర్రినాయుడు అతన్ని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీ గురుదేవ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ రాపర్తి జగదీశ్ కుమార్, వైస్ చైర్మన్ డాక్టర్ ఫణింద్ర ట్రస్ట్ సేవలను గవర్నర్‌కు వివరించారు.

ఏనుగులతో కవ్వింపు చర్యలొద్దు

భామిని : మండలంలోని బొమ్మిక, పకుడిభద్ర పరిసర గ్రామాల్లో సంచరిస్తున్న ఆరు ఏనుగుల గుంపును చూద్దామని చెప్పి పరిసర గ్రామ ప్రజలు వచ్చి ఏనుగుల ప్రశాంత వాతావరణం చెడగొట్టి, కవ్వింపు చర్యలు చేస్తున్నారని అలా చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని ఫారెస్ట్ రేంజర్ కె.తవిటినాయుడు హెచ్చరించారు. ఈ మేరకు ఆయా గ్రామాల్లో అవగాహన కల్పించారు. కవ్వింపు చర్యల వల్ల ఏనుగులు ప్రజలపై దాడి, పరిసర గ్రామాల్లోని పంట పొలాలను నాశనం చేసే అవకాశం ఉందన్నారు. ఏనుగుల ప్రశాంతతను చెడగొడుతూ, కవ్వింపునకు పాల్పడే వారి వివరాలు ఇవ్వాలని స్థానిక సచివాలయానికి సమాచారం ఇచ్చామని, స్థానిక పోలీసులు సమన్వయంతో ఇటువంటి వారిపై చర్యలు తప్పవని అన్నారు. ఇకపై ఎవరూ ఏనుగులు సంచరించే పరిసర ప్రాంతాల్లో అనవసరంగా తిరగరాదు సూచించారు. అని ఎఫ్ ఆర్ ఓ సూచించారు. కార్యక్రమంలో ఎఫ్‌డిఒ తారకేశ్వరరావు, హరికృష్ణ, బీట్ అధికారి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

చెట్టు కూలి... రాక పోకలకు అంతరాయం

భామిని : స్థానిక పిహెచ్‌సి, జిజె కాలేజీ మార్గం సమీపాన ప్రధాన రహదారిపై గురువారం వీచిన గాలి వర్షంతో రావి చెట్టు కూలి సుమారు గంట పాటు 4 చక్రాల వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. విషయం తెలుసుకున్న స్థానిక పోలీస్ సిబ్బంది చెట్టు నరికి, ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడంతో వాహన రాక పోకలు యధావిధిగా కొనసాగాయి.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి - లక్కవరపుకోట

ప్రజా సంకల్ప పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందే విధంగా కృషి చేస్తున్న ఏకైక సిఎం జగన్మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు కొనియాడారు. మండలంలోని తలారిలో గురువారం వైసిపి మండల అధ్యక్షులు గుమ్మడి సత్యనారాయణ (సింగపూర్) ఆధ్వర్యంలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. తొలుత ఉపాధి హామీ నిధులు రూ. 21.80 లక్షలతో ఆర్‌బికె, రూ 17.50 లక్షలతో నిర్మించిన వెల్‌నెస్ సెంటర్లను ఆయన ప్రారంభించారు. అనంతరం ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు, వాటిని అమలు చేసే విధానం, తమ ప్రభుత్వ పరిపాలన గూర్చి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గేదెల శ్రీనివాసరావు, డిసిసిబి చైర్మన్ వేచలపు చినరామనాయుడు, జెడ్‌పిటిసి తూర్పాటి వరలక్ష్మి,


రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కడుబండి

అకాడమీ స్టేట్ డైరెక్టర్ గుమ్మడి స్వాతిరత్నం, జెసిఎస్ మండల కన్వీనర్ యడ్ల కిషోర్ కుమార్, తలారి మాజీ సర్పంచ్ ఎస్ లోకేశ్వరరావు, దాసుళ్లపాలెం సర్పంచ్ ముమ్మున ధనలక్ష్మి, ముమ్మన ప్రసాదరావు, కొట్యాడ మహేష్, ఆవాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బాడంగి : మండలంలోని తెంటువలస సచివాలయం పరిధిలోని పెదపల్లి గ్రామాల్లో రెండో రోజు 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు గురువారం ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలపై ఆరా తీశారు గత టిడిపి చేసిన అభివృద్ధి శూన్యమని వైసిపి వచ్చిన తరువాతే అభివృద్ధి జరిగిందని చెప్పారు. ప్రభుత్వ పథకాల ద్వారా మహిళలు ఆర్థిక స్వావలంబన సాధిస్తున్నారన్నారు. వైఎస్సార్ చేయూత, ఆసరా, అమ్మఒడి తదితర పథకాలు మహిళలకు వరంగా మారాయన్నారు. రాష్ట్రం అభివృద్ధి వైపు అడుగులు వేయాలంటే జగనన్నకు మద్దతు ఇవ్వాలన్నారు. ప్రజల నుండి అందిన అర్జీలను సత్వరం పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి పెద్దింటి రామారావు, నాయకులు ఆవు సత్యనారాయణ, ఆవు సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌పై కక్షసాధింపు

ప్రజాశక్తి- లక్కవరపుకోట

వాళ్ళిద్దరూ (వైసిపి) ఒక గూటి పక్షులే... అంతే కాకుండా ఒకే కుటుంబ బంధుత్వం కలిగినవాళ్లు. అయినా వాళ్ల మధ్య ఏమైందో ఏమో తెలియదు గానీ ప్రాణాపాయస్థితిలో ఉన్న మాజీ సర్పంచ్ పై ప్రస్తుత సర్పంచ్ భర్త కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారు. దేవుడు వరమిచ్చిన పూజారి కనికరించలేదు అన్న చందాన పూర్తయిన నిర్మాణ పనులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిన బిల్లులు అందనివ్వకుండా ప్రస్తుత సర్పంచ్ చప్ప కనకలక్ష్మి భర్త విశ్రాంత ఉపాధ్యాయుడు దేవుడు అడ్డగిస్తున్నారు. దీంతో గేదెలవానిపాలెం పంచాయతీ మాజీ సర్పంచ్ గేదెల నరసింహనాయుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మండలంలోని గేదెలవానిపాలెం పంచాయతీ సచివాలయ నిర్మాణానికి రూ. 25 లక్షలు అంచనా విలువతో భవనం మంజూరైంది. మాజీ సర్పంచ్ గేదెల నరసింహనాయుడు ఆ నిర్మాణ పనులను చేపట్టేందుకు పూనుకున్నారు. సుమారు 8 నెలలు కిందటే సచివాలయ భవన నిర్మాణాన్ని పూర్తిచేసి అధికారులకు అప్పగించారు. ఇందుకు సంబంధించిన బిల్లులు 2021 మార్చి 19న రూ. 10.32 లక్షలు, అదే ఏడాది మరో రూ.1.33 లక్షలు, ఇంకోసారి రూ. 80 వేలు అందాయి. మిగిలిన రూ. 9.61లక్షలు కూడా అతనకు చెల్లించేందుకు నిధులు మంజూరయ్యాయి. వాటికి సంబంధించిన చెక్కులను పంచాయతీ కార్యదర్శి సింగంపల్లి రోహిణికుమార్ సిద్ధం చేసి సంతకాలు కోసం ప్రస్తుత సర్పంచ్ చప్ప కనకలక్ష్మి వద్దకు వెళ్లాడు. అయితే ఈ విషయంలో ఆమె భర్త విశ్రాంత ఉపాధ్యాయుడు దేవుడు కలుగజేసుకుని వాటిపై సంతకాలు పెట్టకుండా తిరస్కరించినట్లు తెలిస్తోంది. అయితే మాజీ, ప్రస్తుత సర్పంచ్ లిద్దరు ఒకే పార్టీకి చెందిన వారే కాకుండా ఇరువురు దగ్గర బంధువులు కావడం విశేషం. అదే పంచాయతీలో ఆర్.బి.కె భవన నిర్మాణాన్ని రంగాపురం పంచాయతీ ఉప సర్పంచ్ ఆవాల సత్యనారాయణ నిర్మించడంతో ఆయనకు మంజూరైన రెండు చెక్కులు రూ. 7.32లక్షలపై సంతకాలు పెట్టారు. విశేషమేంటంటే వీరిద్దరి చెక్కులు ఒకే తారీకుతో కార్యదర్శి రోహిణికుమార్ రెడీ చేసినప్పటికీ ఒకరి చెక్కులపై సంతకాలు పెట్టి మరొకరి చెక్కులపై సంతకాలు పెట్టకపోవడం కక్ష సాధింపు చర్యలు కాదా అంటూ పలువురు విమర్శిస్తున్నారు. దీనిపై సర్పంచ్ చప్ప కనకలక్ష్మి భర్త దేవుడికి 'ప్రజాశక్తి' ఫోన్ చేయగా ఈ విషయంపై ఏమీ చెప్పనని ఇక మీదట తనకు ఫోను చెయ్యొద్దంటూ బదులిచ్చారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ గేదెల నరసింహనాయుడు ప్రజాశక్తితో మాట్లాడుతూ తన ఆరోగ్య రీత్యా ఇటీవల సర్జరీ ఆపరేషన్ చేయించుకున్నానని తెలిపారు. తన ఆరోగ్యం అంతంత మాత్రంగా ఉండడంతో ఎటు తిరగలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పంచాయతీకి తనొకసారి తన భార్య రెండుసార్లు సర్పంచ్‌గా చేసిన తమను ఈ విధంగా ఇబ్బంది పెట్టడం సరి కాదని విచారం వెలిబుచ్చారు. తనకు మంజూరైన సచివాలయ భవన నిర్మాణ బిల్లులు త్వరితగతిన అందజేయాలని ప్రాధేయపడ్డారు. అధికారులు జోక్యం చేసుకొని తనకు మంజూరైన బిల్లు ఇప్పించాలని కోరారు.

ఘనంగా రామాలయం ప్రతిష్ట

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని మోదవలస పంచాయతీ పరిధిలోని గొండయ్యపాలెంలో కాళ్ల రామసూరి, మంగమ్మ దంపతులు, ఆలయ ధర్మకర్త గంటా శ్రీనివాసరావు, గ్రామ ప్రజల సహకారంతో నూతనంగా నిర్మించిన రామాలయ ప్రతిష్ట మహోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామ కోవెలను ముందుగా రామసూరి, మంగమ్మ దంపతులు ప్రారంభించారు. అనంతరం నూతన విగ్రహాలను గ్రామంలో ఊరేగింపుగా తీసుకువచ్చి కోవెలలో ప్రతిష్టించారు. గ్రామ ప్రజలందరూ పూజలు నిర్వహించారు. అనంతరం ఐదువేల మందికి భారీ అన్నదానం నిర్వహించారు. కోవెల నిర్మాణం కోసం ఆర్థికంగా సహకరించిన వారిని ఘనంగా సన్మానించి


ఆలయ ప్రతిష్టలో పాల్గొన్న నిర్వాహకులు

జ్ఞాపికలను అందజేశారు. నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, రాష్ట్ర నాగవంశం డైరెక్టర్ బోని అప్పలనాయుడు, నియోజకవర్గం టిడిపి ఇంఛార్జి కర్రోతు బంగార్రాజు, గ్రామ సర్పంచ్ కనకల రామారావు, ఎన్నింటి కృష్ణ, పలువురు ప్రజా ప్రతినిధులు, రామాలయ ప్రతిష్ట లో పాల్గొని పూజలు నిర్వహించారు.

ఆలయ నిర్మాణానికి రూ. 30వేలు

నెల్లిమర్ల: మండలంలోని అలుగోలు గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న పైడిమారమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి టిడిపి మండల అధ్యక్షులు కడగల ఆనంద్ కుమార్ రూ. 30వేలను గురువారం వితం ణగా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో సంస్కృతి, సాంప్రదాయాలు గౌరవిస్తూ ఆలయ నిర్మాణం జరుగుతున్న నేపథ్యంలో తన వంతు ఆర్థిక సహాయం అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి పార్లమెంటరీ అధికార ప్రతినిధి గేదల రాజారావు, రాష్ట్ర ఎస్‌సి సెల్ కార్యదర్శి రాజప్పన్న, మాజీ సర్పంచ్ గురాన అసిరినాయుడు, అలుగోలు మాజీ ఎంపిటిసి కురిమినేని దివాకర్, గ్రామ పార్టీ అధ్యక్షులు ఆల్తి బాబూరావు, నాయకులు మత్స బోజి, చక్రపాణి మాస్టర్, కెల్ల నారాయణప్పల నాయుడు, వార్డు మెంబర్ కొంచాడ గొల్లబాబు, కెల్ల పాపారావు, నెల్లిమర్ల టిఎన్ఎస్ఎఫ్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ బొమ్మిడి రాము పాల్గొన్నారు.


నగదును అందిస్తున్న ఆనంద్‌కుమార్

వరి సాగుకు సన్నద్ధం

ప్రజాశక్తి - వంగర

మండలంలోని వివిధ గ్రామాల రైతులు వస్తున్న ఖరీఫ్ సీజన్‌లో వరి సాగు చేసేందుకు తమ పొలాలలో దుక్కులు వేసి సన్నద్ధమవుతున్నారు. మండలంలో ప్రధానంగా వరి, మొక్కజొన్న, చెరకు పంట సాగు చేస్తుంటారు. ఈ ఏడాది పొలంలో ఉన్న చెరుకు పంట ఇప్పటికే అన్ని గ్రామాలలో కోత పూర్తయింది. అయితే ఈ చెరకు పంట రైతులకు ఎక్కువగా శ్రమ కలిగించడమే తప్ప గిట్టుబాటు రాకపోవడంతో వీరంతా కూడా చెరకు పంటను తొలగించి వస్తున్న ఖరీఫ్‌లో వరి సాగు చేసి దాని తర్వాత మొక్కజొన్న పంట వేసేందుకు రైతులు మొగ్గు చూపుతున్నారు. మండలంలో వివిధ గ్రామాలలో ప్రస్తుతం ఉన్న మొక్కజొన్న పంట కూడా దాదాపు కోత దశ పూర్తయింది. మరోవైపు ఇటీవల వర్షాలు కూడా కురవడం, పొలాలల్లో దుక్కులు వేసేందుకు అనుకూలించడంతో వివిధ గ్రామాలలో రైతులు తమ తమ పొలాలలో వస్తున్న ఖరీఫ్‌లో ఎదలు వేసేందుకు, నారుమడులు బాగు చేసుకునేందుకు సిద్ధమవుతున్నారు. గతేడాది కంటే ఈ ఏడాది వరి సాగు ఎక్కువయ్యే అవకాశం ఉందని పలువురు రైతులు చెబుతున్నారు. దీనికి సంబంధించి ప్రభుత్వం స్పందించి ఖరీఫ్ సీజన్‌కు రైతులకు సకాలంలో విత్తనాలు అందించేందుకు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.


నారు మడిని సిద్ధం చేసుకుంటున్న రైతు

రేషన్ పంపిణీలో తీవ్ర జాప్యం

పార్వతీపురం రూరల్ : పట్టణంలో రేషన్ సరుకుల పంపిణీలో తీవ్రమైన జాప్యం జరుగుతుందని, ఈనెల 11వ తేదీ వచ్చినా సగం వార్డుల్లో పంపిణీ జరగలేదని, సకాలంలో రేషన్ సరుకులు అందేందుకు చర్యలు చేపట్టాలని సిపిఎం పట్టణ కార్యదర్శి గొర్లి వెంకటరమణ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం సిపిఎం సభ్యులతో కలిసి తహశీల్దార్ శివన్నారాయణకు వినతి అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ కొన్ని నెలలుగా పట్టణంలోని పలు రేషన్ డిపోల్లో బండ్లద్వారా కందిపప్పు, పంచదార ఇవ్వడం లేదని, ఈనెల ఇంతవరకు రేషన్ బియ్యం ఇవ్వకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. పైగా పండగలు, శుభకార్యాలు జరుగుతున్నాయని, దీనిపై విచారణ జరిపి పట్టణ ప్రజలకు సకాలంలో రేషన్ బియ్యంతో పాటు పప్పు, పంచదార అందించేలా చర్యలు చేపట్టాలని తహశీల్దారును కోరారు. దీనికి ఆయన స్పందించి సివిల్ సప్లై డిప్యూటీ తహశీల్దార్ రమణను పిలిపించి ఫిర్యాదుపై ఆరా తీసి, సరుకులు పంపిణీ వేగవంతం చేయాలని, జాప్యం జరిగితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు పాకల సన్యాసిరావు, బంకురు సూరిబాబు, ఉమా, పాల్గొన్నారు.

పట్టణ సుందరీకరణకు చర్యలు: ఎమ్మెల్యే

ప్రజాశక్తి- బొబ్బిలి

పట్టణ సుందరీకరణకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. రాణిమల్లమ్మదేవి పార్కు, వైఎస్ఆర్ విగ్రహం జంక్షన్, ఇండోర్ స్టేడియంను జెసి మయూర అశోక్‌తో కలిసి ఎమ్మెల్యే గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాణిమల్లమ్మదేవి పార్క్, వైఎస్ఆర్ బొమ్మ జంక్షన్‌ను ఆధునీకరిస్తామన్నారు. బుడా నిధులు మంజూరుకు ప్రతిపాదనలు చేసినట్లు చెప్పారు. జెసి అశోక్ మాట్లాడుతూ పార్కు నుంచి చెరువులోకి మురుగునీరు వెళ్లకుండా కాలువలు నిర్మించాలన్నారు. చెరువులో నీటిని బయటకు పూర్తిగా తోడాలన్నారు. ఇండోర్ స్టేడియం వద్ద ఆరు ఎకరాలు స్థలంలో క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేయాలన్నారు. స్థలం చుట్టూ ప్రహరీ నిర్మించి క్రీడా సామగ్రి ఏర్పాటు చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అధికారులు,


ప్రణాళికను పరిశీలిస్తున్న జెసి, ఎమ్మెల్యే

వైసిపి నాయకులు పాల్గొన్నారు.

సిఎం కప్ అథ్లెటిక్ విజేత గణేష్

బొబ్బిలి: తిరుపతిలో ఈ నెల 1 నుంచి 5 వరకు జరిగిన సిఎం కప్ అథ్లెటిక్స్ పోటీలలో బొబ్బిలి మండలం అలజంగి గ్రామానికి చెందిన క్రీడాకారుడు రాపాక గణేష్ విజేతగా నిలిచాడు. అథ్లెటిక్స్ లో 100 మీటర్లు, 200 మీటర్లు విభాగంలో గణేష్ మొదటి స్థానంలో నిలిచాడు. దీంతో స్థానిక వైసిపి కార్యాలయంలో గణేష్ ను ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అభినందించారు. సిఎం కప్ పోటీలలో బొబ్బిలికు కప్ తీసుకొచ్చిన గణేష్‌ను ఎమ్మెల్యే కొనియాడారు. కార్యక్రమంలో అలజంగి ఉప సర్పంచ్ పి.లక్ష్మునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన డిఎస్‌పి

ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడును నూతన డిఎస్‌పి పి. శ్రీధర్ వైసిపి కార్యాలయంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. బొబ్బిలిలో ఇప్పటి వరకు పని చేసిన డిఎస్‌పి మోహనరావుకు విశాఖ రైల్వే డిఎస్‌పిగా బదిలీ అవ్వడంతో ఆయన స్థానంలో వచ్చిన శ్రీధర్ బాధ్యతలు చేపట్టి ఎమ్మెల్యేను కలిసి ట్రాఫిక్, ఇతర సమస్యలపై చర్చించారు. శాంతిభద్రతల పరిరక్షణకు పని చేస్తామని డిఎస్‌పి అన్నారు.

ఆత్మ స్థైర్యం కల్పించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

అనుకోని ప్రమాద సంఘటన వల్ల ఆప్తులను కోల్పోయి పుట్టెడు దుఃఖంలో మునిగి ఉన్న గిరిజనుల కష్టాన్ని తెలుసుకొని వారి దగ్గరకు వెళ్లి వారికి అవసరమైన సహాయ సహకారాలు అందజేసి వారిలో ఆత్మ స్థైర్యాన్ని కల్పించి అండగా నిలిచారు స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు. వివరాల్లోకి వెళితే సాలూరు నియోజకవర్గం మెంటాడ మండలం రెడ్డివానివలసకు చెందిన గిరిజనులు బుధవారం బందలుప్పి పంచాయతీ, నిమ్మవానివలసలో జరిగిన వివాహ శుభ కార్యక్రమానికి వెళ్తుండగా రోడ్డు ప్రమాదంలో ఇద్దరు ప్రాణాలు కోల్పోయిన ఘటనతో విషయం తెలుసుకున్న వారి బంధువులు పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి గురువారం వచ్చి మృతదేహాల కోసం నిరీక్షిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే జోగారావు ఏరియా ఆసుపత్రి వైద్యాధికారులు, పోలీస్ అధికారులతో మాట్లాడి పోస్ట్‌మార్టం త్వరగా చేయించి వారికి వాహనాల సౌకర్యం కల్పించి అవసరమైన సహాయ సహకారాలు అందచేసి ఇంకేమైనా అవసరం ఉన్నా తనకు ఫోన్ చేస్తే తప్పక సహాయం చేస్తానని భరోసా ఇచ్చారు. దీంతో బాధిత గిరిజనులు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.

ఉపాధ్యాయ బదిలీలపై ప్రతిపాదనలు

గుమ్మలక్ష్మీపురం : త్వరలో జరగనున్న ఉపాధ్యాయ బదిలీలపై విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్ కుమార్‌కు ఆంధ్రప్రదేశ్ ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం పక్షాన ప్రతిపాదనలు పంపించినట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సామల సింహాచలం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఉపాధ్యాయ సంఘాల సమావేశంలో ఉపాధ్యాయ బదిలీలపై సంఘాల నుంచి తగిన సూచనలను, ప్రతిపాదనలను ఈనెల 10లోగా రాష్ట్ర విద్యా శాఖ అధికారులకు పంపించాలని చెప్పారన్నారు. ఈ మేరకు ప్రతిపాదనలు పంపామన్నారు.

గణితంతోనే మనిషి ప్రయాణం

భామిని : ప్రతి ఒక్కరి జీవన క్రమంలో గణితం మిళితమై ఉంటుంది, గణిత అంశం లేని రోజు మనిషి జీవితంలో లేదని గణిత ఉపాధ్యాయులు పెద్దిన సన్యాసిరావు అన్నారు. స్థానిక గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో గణిత ఉపాధ్యాయులు సన్యాసిరావు గణిత ప్రాథమిక అంశాలు, వివరాలు, పలు రంగాల్లో ఉన్నత లక్ష్యాలు సాధించాలంటే గణితం తప్పనిసరి అని, విద్యార్థులు గణితం పట్ల ఆశక్తి కనబరచాలని తెలిపారు. కార్యక్రమంలో లైబ్రెయిన్ సునీత, 30 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

అశోక్ గజపతిరాజును విమర్శించే స్థాయి లేదు

వేపాడ : మంత్రి రోజాకు టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు, మాజీ కేంద్ర మంత్రి అశోక్ గజపతిరాజును విమర్శించే స్థాయి లేదని టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఇటీవల జిల్లాకు వచ్చిన రోజా అశోక్‌గజపతిరాజుపై నోరు పారేసుకోవడం బాదాకరమన్నారు. ఆయన రాజకీయ చరిత్రలో మచ్చలేని నాయకుడిగా పేరు సంపాదించారన్నారు. ఈరోజు రోజా మంత్రి పదవిలో ఉండడానికి కారణం టిడిపి పెట్టిన బిక్ష అన్న విషయాన్ని మర్చిపోవద్దన్నారు.



అవార్డును అందుకుంటున్న తులసి

హాకీలో తులసికి అవార్డు

వేపాడ : మండలంలోని బానాది గ్రామానికి చెందిన కుప్ప తులసి 13వ జాతీయ హాకీ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ తరపున పాల్గొని పంజాబ్, గుజరాత్ క్రీడాకారులను ఓడించి పతకం సాధించింది. ఈమె కడప జిల్లాలో వైయస్సార్ క్రీడా పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. ఈనెల 4వ తేదీ నుంచి 14వ తేదీ వరకు ఒడిసాలో జరుగుతున్న 13వ హాకీ ఇండియా సబ్ జూనియర్ ఉమెన్ నేషనల్ ఛాంపియన్షిప్ 2023లో ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు అందుకుంది. ఈ సందర్భంగా ఆమెను గ్రామస్తులు అభినందించారు.


సిబ్బందితో మాట్లాడుతున్న చైర్మన్

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

ప్రజాశక్తి- బొబ్బిలి

సచివాలయ ఉద్యోగులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణారావు అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో గురువారం 7,8 సచివాలయ ఉద్యోగులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు అందించాలన్నారు. స్పందనకు వచ్చే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కోరారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ జి.రమాదేవి, కౌన్సిలర్ ఎస్.శ్రీలక్ష్మి, కృష్ణారావు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

పెదపెంకిలో దాహం కేకలు

బలిజిపేట : మండలంలోని పెదపెంకిలో గత వారం రోజులుగా మంచినీరు లేక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బాపూజీ గ్రంథాలయ వ్యవస్థాపకులు ఈర్ల సంజీవనాయుడు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచినీరందక గురువారం ప్రజలు ఖాళీ బిందెలతో నిరసన తెలిపారని, వారం రోజులుగా మంచినీరు తాగడానికి అందుబాటులో లేదని, స్థానికంగా ఉన్న పంచాయతీ కార్యదర్శి గానీ, సంబంధిత అధికారులు గానీ, ఈ విషయంపై స్పందించలేదని ఆందోళన వ్యక్తం చేశారు. వాటర్ ట్యాంక్ దగ్గర గానీ మోటర్ రిపేర్ విషయంలో గానీ పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోలేదని, దీనివల్ల ప్రజలకు మంచినీటి అంతరాయం కలుగుతుందని ఆయన అన్నారు. వెంటనే అధికారులు స్పందించి గ్రామంలో మంచినీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు దాహం కేకలు తీర్చాలని ఆయన కోరారు. కలుషిత నీరు తాగడం వల్ల ప్రజలు వ్యాధులు బారిన పడుతున్నారని అన్నారు.

200 రోజులు పని కల్పించాలి

శృంగవరపుకోట : జాబ్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి సంవత్సరానికి 200 రోజులు పని దినాలు కల్పించాలని ఎపి రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మద్దిల రమణ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పథకం కూలీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్లతో కూడిన కరపత్రాలను చెరువుల వద్దకు వెళ్లి ఉపాధి కూలీలకు గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మద్దిల రమణ మాట్లాడుతూ ఉపాధి హామీ పనిని ఒక్క పూటే పెట్టాలన్నారు. కొత్త సాఫ్ట్‌వేర్ రద్దు చేయాలన్నారు. రోజు కూలి రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు మే 22వ తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరుగు ధర్నాలో వ్యవసాయ కార్మికులంతా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అందులో భాగంగానే కార్మికులకు కరపత్రాలను పంపిణీ చేస్తున్నామన్నారు.

నేరాలు ఘోరాలు

విద్యుదాఘాతంతో లారీ డ్రైవర్ దుర్మరణం

డెంకాడ : మండలంలోని పెదతాడివాడ సమీపంలో ఉన్న ఇసుక స్టాక్ పాయింట్ వద్ద కరెంట్ షాక్‌తో లారీ డ్రైవర్ గురువారం మృతి చెందాడు. పోలీసుల వివరాలు ప్రకారం తమిళనాడుకు చెందిన కె. వెంకటేషన్ (43) శ్రీకాకుళం నుంచి పెదతాడివాడ సమీపంలో ఇసుక స్టాక్ పాయింట్ వద్దకు లారీతో ఇసుకను తీసుకొచ్చాడు. అన్‌లోడ్ చేసి అలాగే ముందుకు వెళ్లాడు. లారీ బాడీ పైకి లేపి ఉండటంతో పై నుంచి వెళ న్న హెచ్‌డి లైన్ వైర్లు లారీకి తగిలి ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. లారీ ఫ్రంట్ టైర్లు పేలిపోవడంతో లారీలో ఉన్న డ్రైవర్ షాక్ గురయ్యాడు. దీంతో స్టాక్ పాయింట్‌కు చెందిన వ్యక్తులు అతన్ని విజయనగరం ఆస్పత్రికి తరలించారు. అక్కడ డాక్టర్లు పరీక్షలు నిర్వహించి అప్పటికే చనిపోయినట్లు నిర్ధారించారు. ఈ సంఘటన గురువారం తెల్లవారు జామున రెండున్నర గంటల ప్రాంతంలో జరిగింది. ఎస్ఐ యు మహేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులో పడి ఒకరు మృతి

వేపాడ : మండలంలోని నీలకంఠరాజుపురం గ్రామ సమీపంలో గల చెరువులో అదే గ్రామానికి చెందిన కసింకోట లక్ష్మణ(30) గురువారం బట్టలు ఉతుకుతుండగా ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందాడు. వృత్తి రీత్యా రజకుడైన ఈయనకి మూర్ఛ వ్యాధి ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతునికి ఇద్దరు పిల్లలు, భార్య ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు వల్లంపూడి ఎస్ఐ రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.